క్లుప్తంగా

4న నూజెండ్ల మండల సమావేశం

వినుకొండ (నూజెండ్ల): మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జిలానీ బాషా మంగళవారం తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

నేడు కారుమంచిలో బ్యాంకు ప్రారంభోత్సవం

శావల్యాపురం: నేడు మండలంలోని కారుమంచి గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నూతన బ్రాంచ్ ఆరంభిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజరు కావూరి సాయిచంద్ర చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, బ్యాంకు చైర్మన్ టి. కామేశ్వరరావు, నరసరావుపేట రీజనల్ మేనేజరు పి.మారుతీరామ్, ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు పాల్గొంటారన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో బుధవారం ఉదయం వైఎస్సార్ పెన్షన్‌కానుక – సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలో 9348 మంది లబ్ధిదారులకు గాను రూ.2,57,85,250లు నగదు తెల్లవారుజాము నుంచే వలంటీర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ఘనంగా టైలర్స్ డే

వినుకొండ(నూజెండ్ల): స్థానిక రైలు పేటలోని టైలర్స్ అసోసియేషన్ హాల్‌లో 40వ టైలర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని టైలర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. అనంతరం మహిళా టైలర్ కుమారికి కుట్టుమిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఈఎండీ ఇస్మాయిల్, ఎస్‌కే జిలానీ, కె.కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎలికెట్టి నరసింహారావు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం గ్రామపంచాయతీ శివారు గ్రామం భాస్కర్ నగర్‌లో అంగన్‌వాడీ సెంటరుకు దాతలు సహకారం అభినందనీయమని సెక్టారు సూపర్‌వైజరు గుర్రం శేషకుమారి అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు అంగన్ సెంటరు సెంటరును సందర్శించి స్టాండ్ ఫ్యాన్ వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వెంపరాల శ్రీలక్ష్మి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఉన్నారు.

ఇంధన పొదుపు డ్రైవర్లుగా మెలగాలి



నరసరావుపేట: ఆర్టీసీలో డ్రైవింగ్ స్కూలులో శిక్షణ తీసుకున్న వారు ప్రమాద రహిత, ఇంధన పొదుపు డ్రైవర్లుగా మెలగాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు కోరారు. స్థానిక డిపోలో నిర్వహిస్తున్న హెవీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తిచేసుకున్న 11వ బ్యాచ్ అభ్యర్థులకు మంగళవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. హెవీ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్, డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి, ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్.మోహనరెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన

ఈపూరు: మండలంలోని వనికుంట (బ్రహ్మండపురం)లో తమ ఇళ్లకు వచ్చేందుకు బాట లేదని ఒక వ్యక్తిని రోడ్డును కూడా ఆక్రమించుకొని గోడ కట్టాడని గ్రామస్తులు తహసీల్దార్ రమావత్ వెంకటేశ్వర్లునాయక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్ గ్రామానికి చేరుకొని రహదారిని పరిశీలించారు. రోడ్డు లోపలికి కూడా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు.ఆర్అండ్‌బీ రోడ్డులో షాపులు ఉన్నాయని ఆర్అండ్‌బీ అధికారులకు తెలియపరుస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, వీఆర్వో నాసర్‌వలి, సర్వేయర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

వాహనాల వేలం ద్వారా రూ.5.15 లక్షల ఆదాయం

నరసరావుపేట టౌన్: పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను వేలం వేయటం ద్వారా ప్రభుత్వానికి రూ.5.15 లక్షలు ఆదాయం లభించిందని స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్ర బాబు మంగళవారం తెలిపారు. మద్యం అక్రమ రవాణ కేసులో సీజ్ చేసిన 14 వాహనాలను అధికారుల సమక్షంలో వేలం నిర్వహించటం జరిగిందన్నారు. పాటదారులు పాల్గొని వాహనాలను వేలం ద్వారా దక్కించుకున్నారన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వేల్పూరులో కర పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఐదవరోజు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన పార్టీ అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వేల్పూరుకు చెందిన ఎస్టీ కుటుంబాలకు చెందిన సాగు భూమి పోట్లూరు రెవెన్యూ గ్రామంలో 10 ఎకరాలు ఉందని రీసర్వే పనులు రెవెన్యూ అధికారులు పలు రకాల అభ్యంతరాలు చెప్పారని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. బడుగు బలహీన వర్గాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, గ్రామపార్టీ అధ్యక్షులు తూమాటి కబ్బారావు, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకట్రావు, ఉప సర్పంచ్ మారాసు రామయ్య, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, వైఎస్సార్ సీపీ నాయకులు పారా వీరాంజినేయులు, గుడిబల్ల సుబ్బారావు, మొగిలి ఆదినారాయణ, షేక్ లాల్‌సాహెబ్, కుంకులకుంట అజంతావలీ, గంజి వెంకటేశ్వర్లు, బీర్నేడి రత్నగిరి, ఆలపాటి శివ, కొమటినేని అశోక్ చౌదరి, యుగంధర్, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చిలకలూరిపేట అభివృద్ధికి పెద్దపీట

- మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని
- సాధారణ సమావేశంలో పలు అంశాల ప్రస్తావన



మాట్లాడుతున్న షేక్ రఫాని

చిలకలూరిపేట: అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ ఎజెండా రూపొందించినట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ముందుగా ఎజెండా చదువుతున్న సమయంలో టీడీపీ కౌన్సిలర్ కొత్త కుమారి మాట్లాడుతూ ఎజెండాలో లక్షలాది రూపాయలతో వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేసేందుకు అంశాలను పొందిపరిచారని, తన వార్డులో కల్వర్టు ఆవశ్యకత ఉందని చెప్పారు. దీనికి చైర్మన్ మాట్లాడుతూ పట్టణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అన్ని వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులను ప్రతిపాదించటం జరిగిందని చెప్పారు. కల్వర్టు పనులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతిపాదించటం జరిగిందని, త్వరలోనే నిర్మాణం చేస్తామని చెప్పారు. ఏడో వార్డు కౌన్సిలర్ చెమిటిగంటి పార్వతి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాంకేతిక కారణాలతో పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేలా ఎజెండాలో పలు అభివృద్ధి పనులు పొందుపరచటం అభినందనీయమని చెప్పారు. టీడీపీ కౌన్సిలర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వసతులు కల్పించకుండానే టిడ్కో గృహాలు లబ్ధిదారులకు స్వాధీనం చేస్తున్నా రని విమర్శలకు దిగారు. చైర్మన్ రఫాని మాట్లాడుతూ 4 వేల టిడ్కో గృహాలకు అన్ని వసతులు కల్పించాకే లబ్ధిదారులకు స్వాధీనం చేస్తున్నామని చెప్పారు. వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకారాదు

కలెక్టర్ శివశంకర్



దివ్యకు నగదు అందజేస్తున్న కలెక్టర్

నరసరావుపేట ఈస్ట్: చదువుకు పేదరికం అడ్డుకారదని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ యువజన విభాగం ఆధ్వర్యంలో పేద విద్యార్థిని పెరురి దివ్య ఉన్నత చదువులకు రూ.60 వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఫీజుల నిమిత్తం ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అత్తులూరి సుబ్బరావును ఆర్థిక సహాయం కోసం సంప్రదించగా తన మిత్రుల సహకారంతో నగదును సమకూర్చారు. ఈసందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, విద్యార్థిని దివ్యకు ఉన్నత విద్యను అందించేందుకు ఐవీఎఫ్ చేస్తున్న సహకారాన్ని అభినందించారు. గత రెండు సంవత్సరాల కాలంలో ఐవీఎఫ్ చేపట్టిన సామాజిక కార్యక్రమాల వివరాలు తెలుసుకొని వారిని అభినందించారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యా సంయుక్త సంచాలకులు ఈవీ సుబ్బారావు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక లయోలా ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పాఠశాల విద్యా సంయుక్త సంచాలకులు ఈవీ సుబ్బారావు, పల్నాడు జిల్లా డీఈవో ఎం.వి.వెంకటప్పయ్యలు హాజరై మాట్లాడుతూ 10వ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి తీసుకోవల్సిన విధివిధానాలపై వివరించారు. అంతకుముందుగా ఎస్‌ఏ పరీక్షల్లో వివిధ పాఠశాలల ఫలితాలను సమీక్షించి తక్కువ సామర్థ్యం ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు అదనపు తరగతులు నిర్వహించాలని, సిలబస్‌లోని అంశాలను వివరంగా బోధించి విద్యార్థులు పరీక్షల్లో ఆ అంశాలను చక్కగా రాసేలా చూడాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 275 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఐదు మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దేశ కీర్తిప్రతిష్టలు రామన్ ఇనుమడింప చేశారు



వినుకొండలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న కౌన్సిలర్

నాదెండ్ల: భౌతిక శాస్త్రంలో భారతదేశ కీర్తిని రెపరెపలాడించిన గొప్ప శాస్త్రవేత్త చంద్రశేఖర్ వెంకట్ రామన్ అని హెచ్‌ఎం టి.సత్యనారాయణ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డయ్య చౌదరి, కృష్ణకుమారి, దుర్గాదేవి, నాయక్ పాల్గొన్నారు. గణపవరం రాజీవ్‌గాంధీకాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం గురులింగం, విద్యార్థులు సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. రామన్ విజ్ఞానానికి నోబెల్ బహుమతితో పాటూ భారతరత్న పురస్కారం అందుకున్నారని పేర్కొన్నారు.

ఇస్సప్పాలెంలో..

నరసరావుపేట రూరల్: మండలంలోని ఇస్సప్పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను జిల్లా విద్యాశాఖ ఏఎంవో పులిపాటి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరామచంద్రపు చంద్రశేఖర్, సైన్స్ ఉపాధ్యాయినీ జయమాధురి, గ్రామపెద్దలు కొండపల్లి చిన్నకోటయ్య, జల్లి శ్రీనివాసరావు, వేముల రవి, పిన్నెబోయి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీసేందుకు ఉపయోగపడతాయని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని సుబ్బయ్యతోటలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సీహెచ్ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: స్థానిక మండలంలోని పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ డే నిర్వహించారు. రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌డే ను పురస్కరించుకొని విద్యార్థులకు మానవ భాగాలను చిత్రీకరించటంపై పోటీలు నిర్వహించింది. పోటీలను సైన్స్ ఉపాధ్యాయులు రమాదేవి, శ్రీనివాసరెడ్డిలు పర్యవేక్షించగా, అలవాల గ్రామంలో నిర్వహించిన పోటీలను హెచ్‌ఎం జి. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని హర్ష స్కూల్లో సైన్స్‌డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 30వ వార్డు కౌన్సిలర్ షేక్ షకీలా పాల్గొని విద్యార్థులు తయారు చేసిన నమూనాలను తిలకించి అభినందించారు. పట్టణంలోని నిర్మలా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి గోవింద్ మాట్లాడుతూ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ గిన్నిస్, సుపీరియర్ సిస్టర్ కాస్పర్, సిస్టర్ సిద్ధార్థ, సిస్టర్ ప్రశాంతి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు మంగళవారం స్కూల్స్‌లో ఘనంగా నిర్వహించారు. లింగారావుపాలెం జెడ్పీహైస్కూల్లో విద్యార్థులు సైన్సు ప్రాజెక్టులను పాఠశాల ప్రాంగణంలో రంగువల్లులుగా వేసి అందర్నీ అబ్బురపరిచారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మానవళీ అభ్యున్నతికి విజ్ఞానశాస్త్రం ఫలాలు ఎంతో దోహదపడతాయని బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు అధ్యక్షులు సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా బహుమతులు కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్‌చందు అధ్యక్షతన ప్రదానోత్సవ సభ ఘనంగా నిర్వహించారు.

నలుగురిపై వరకట్నం కేసు

నాదెండ్ల: అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్న భర్తతో పాటూ మరో ముగ్గురిపై నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాల మేరకు తూబాడు గ్రామానికి చెందిన షేక్ మైమున్‌కు ఏడాది క్రితం పిడుగురాళ్ళకు చెందిన షేక్ అబూబకర్‌తో వివాహమైంది. వివాహమైన కొద్దినెలల నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్త వేధింపులకు గురి చేస్తున్నాడంటూ మంగళవారం మైమున్ ఫిర్యాదు చేసింది. దీంతో భర్త అబూబకర్‌తో పాటూ మరో ముగ్గురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై అట్రాసిటీ కేసు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో యువకుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.భాస్కర్ తెలిపారు. సాతులూరు గ్రామానికి చెందిన కోటా రాణి భర్త యాకోబ్‌ను ఇదే గ్రామానికి చెందిన సందిరెడ్డి అశోక్ గతంలో కొట్టి గాయపరిచాడని కేసు నమోదైంది. ఈ కేసులో రాజీకి రావటం లేదని ఈ నెల 25న రాత్రి 8 గంటల సమయంలో యాకోబ్ భార్య రాణిపై అశోక్ దాడిచేసి కులం పేరుతో దూషించాడు. దీంతో ఆమె నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్ర బాబు మంగళవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన అబ్దుల్ రహిమాన్ ఇంట్లో గత ఏడాది నవంబర్ 2వ తేదీన చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనలో లభ్యమైన వేలిముద్రలు ఆధారంగా నిందితులు పాతనేరస్తులైన రాజుపాలెం మండలం కొండమోడుకు చెందిన షేక్ బాబావలి, అనంతపురం జిల్లా టెలిగి గ్రామానికి చెందిన కోరంకి రవితేజలుగా గుర్తించారు. అప్పటి నుంచి నిందితుల కోసం గాలిస్తుండగా మంగళవారం పట్టుబడ్డారు. నిందితులపై గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో 20కి పైగా చోరీ కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.


ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

యడ్లపాడు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్ కుమార్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతనదారుల్ని పనుల నిర్వహణపై చైతన్యం చేయాలన్నారు. వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని అలా అయిన వాటికే వేతనాలు వస్తాయన్న విషయాన్ని వివరించాలన్నారు. సోమవారం నుంచి 200 మంది కూలీలు తగ్గకుండా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు కార్యక్రమంలో ఏపీవో విజయకుమారి, టీఏ మాధవీ, సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

బొల్లాపల్లి: మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో ఉచిత పశువైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. గుమ్మనంపాడు పశువైద్యాధికారి డాక్టర్ బి.సాల్మన్ సింగ్ మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ వల్ల మహిళా రైతులకు కలుగుతున్న లబ్ధిగురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పీపాల సాయిబాబా, పశువైద్య సిబ్బంది, పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రానివ్వకండి



నరసరావుపేట: రానున్న వేసవి కాలంలో పురపాలక పరిధిలోని ప్రతి ఇంటికి మంచినీరు అందే విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం ఉదయం రాబోయే వేసవి ముందస్తు చర్యలో భాగంగా పబ్లిక్ హెల్త్ ఆఫీస్, మున్సిపల్ స్కూల్, ప్రశాంతినగర్, మున్సిపల్ బంగ్లాలో ఉన్నటువంటి ఓవర్‌హెడ్ (ఈఎల్ఆర్ఎస్) ట్యాంక్‌లను పరిశీలించారు. కొన్ని ప్రాంతాలలో వాల్వులు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉన్నదని తద్వారా ప్రతి ఒక్క ప్రాంతానికి మంచినీరు వృథాకాకుండా సమానంగా సరఫరా చేయవచ్చునని, అందుకు సంబంధించిన ప్రణాళికలను వార్డు ఇమ్యూనిటీ సెక్రటరీలు, ఫిట్టర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు సమన్వయం చేసుకొని త్వరగా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.

■ వెల్‌కం సార్





తెనాలిలో రైతు భరోసా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి విడదల రజిని, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

హాస్టళ్లలో జూనియర్ సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీ



విద్యార్థినీలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి ఎ. తౌషిద్ హుస్సేన్

వినుకొండ టౌన్: పట్టణంలోని కస్తూరిబా బాలికల వసతిశాల, సాంఘిక సంక్షేమ బాలుర వసతిశాలలను వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ. తౌషిద్ హుస్సేన్ న్యాయవాదులతో కలిసి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూను పరిశీలించి, సూచిక ప్రకారం అమలు చేస్తున్నది లేనిది అక్కడి చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వసతిశాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, సమయపాలన పాటిస్తూ మంచి నడవడికతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా ప్రాథమిక స్థాయి నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండి చట్టాలను గౌరవించాలన్నారు. తనిఖీలలో భాగంగా వసతిశాల, భోజనశాలలను పరిశీలించి నిర్వాహకులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరె సామ్రాజ్యం, కోశాధికారి పి.వి.రమణారెడ్డి, కె.చెన్నకేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కొండవీడుకు ఇజ్రాయిల్ దేశస్తులు



కోటను సందర్శిస్తున్న అధ్యయన బృందం

యడ్లపాడు: సుదీర్ఘ చారిత్రక ప్రాంతమైన కొండవీడుకోటను సందర్శించినపుడల్లా శరీరానికి ఆహ్లాదం మనసుకు గొప్ప అనుభూతి కలుగుతుందని సంస్కృత భాష ఆచార్యులు ఇగాల్ బ్రోనర్ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ హిబ్రూ విశ్వవిద్యాలయ సంస్కృతభాష అధ్యయన బృందం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు కోట పర్యాటక ప్రాంతాన్ని మంగళవారం సందర్శించింది. కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి బృంద సభ్యులకు గిరిదుర్గంలోని ప్రాచీన కట్టడాలను చూపి వాటి విశిష్టతలను తెలియజేశారు. కొండపై ఉన్న మూడు చెరువులను, యోగివేమన మండపాలను బృందం సభ్యులు ఆసక్తిగా తిలకించారు. కొండవీడును రాజధానిగా చేసుకుని పాలిస్తున్న సమయంలో కొండలపై ఉన్న వారికి నీటి ఇబ్బందులు లేకుండా వీటిని ఆనాడు నిర్మించినట్లు వివరించారు. తమ అధ్యయనంలో భాగంగా విద్యార్థులకు ప్రొఫెసర్ ఇగాల్ బ్రోనర్ నాటి చారిత్రక సాహిత్యం గురించి వివరించారు. సంస్కృత కవులైన రెడ్డి రాజులు కుమారగిరిరెడ్డి, కాటయ్య వేమారెడ్డి, పెద కోమటి వేమారెడ్డి అనేక గ్రంథాలు రాశారని, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. గతంలోనూ ఓసారి కొండవీడును తాను సందర్శించానని, ఇక్కడికి వచ్చినప్పుడు నాకు ఒక అవ్యక్తమైన అనుభూతి కలుగుతుందని ప్రొఫెసర్ ఇగాల్ సంతోషంగా చెప్పారు.

నేటి నుంచి ప్రతిష్టా మహోత్సవాలు

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం బుధవారం నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దాదాపు రూ.70 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ప్రతిష్టా మహోత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. ఈనెల 3వ తేదీ శుక్రవారం ఉదయం 11.42 గంటలకు ఆలయ ధ్రువబింబ, జీవధ్వజ, విమాన శిఖర, నాగరాజ, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటుచేశారు. యాగశాలను సిద్ధం చేశారు. అకళంకం వెంకట రామకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో ప్రతిష్టా కార్యక్రమం జరుగనుంది. రెడ్డినగర్ మెయిన్‌రోడ్డును విద్యుత్‌దీపాలతో అలంకరించారు. 3వ తేదీ ప్రతిష్టా కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొననున్నారు. ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకుని 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అన్నసంతర్పణ నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.